శాంతీ! నువ్వెక్కడా?

వేదగిరి రాంబాబు

శాంతిట... శాంతి!

ఆమెను చేసుకుంటే నాకు దొరికేది శాంతి కాదు — అశాంతి!

భార్య అందంగా వుండాలనుకోవడం ఆశకావచ్చు, కానీ కనీసం అసహ్యం పుట్టేటట్లు వుండకుండా వుండాలనుకోవడం దురాశకాదు కదా?!

శాంతి తండ్రి లక్షాలాధికారే కావచ్చు. ఆమె అతనికి ఏకైక పుత్రికేకావచ్చు. ఒక్కసారి ఆమె మొహం వంక చూస్తేచాలు. భయంతో, అసహ్యంతో వళ్ళు గగుర్పొడుస్తుంది. అటువంటి ఆమెతో సంసారం చెయ్యడంఎలా!

అందుకే అందరూ నచ్చచెప్పాలని ప్రయత్నించినా ఆమెను చేసుకోనని ఖచ్చితంగా చెప్పేసాను.

నా శ్రేయోభిలాషులందరికీ కోపం వచ్చింది. 'సిరిరామోకాలు అడ్డడం' అంటే ఇదే! నా విపరీతభావాలకి జాలిపడ్డారు. నేను మాత్రం గర్వపడ్డాను.

ఆఫీసుకి వచ్చినా ఇంకా నన్ను ఆ ఆలోచనలు విడిచిపెట్టలేదు.

నేనే పెందలాడే వచ్చాననుకున్నాను. కానీ అప్పటికే ప్రసాద్ వచ్చేసి వున్నాడు.

అతను నాకన్నా ఎక్కువగా ఆలోచిస్తూ కనిపించాడు. అతని బాధ ఏమిటో పాపం?

ఆలోచిస్తున్నవాడల్లా హఠాత్తుగా "డామిట్..." అంటూ ఎదురుగావున్న బల్లమీద గట్టిగా గుద్దాడు.

ఉలిక్కి పడి వూరుకోలేక పోయాను.

నెమ్మదిగా అతని సీటు దగ్గరకు వెళ్ళి పక్కనున్న కుర్చీలో కూలబడ్డాను. ఆఫీస్ టైమ్ ఇంకా వుండడంతో మరెవ్వరూ రాలేదు.

నా వునికి కూడా ప్రసాద్ గమనించడంలేదు. పళ్ళు కొరుకుతున్నాడు · గుర్లురుముతున్నాడు. మధ్య మధ్య బల్ల గుద్దుతున్నాడు. గుడ్ల నీరు కుక్కుకుంటున్నాడు.

"ఏమిట్రా? ఏమైంది?' అడిగాను.

"అది... అది..." పళ్ళు పటపటా కొరికాడు. నావంక గుర్లురుమి చూసాడు.

నాకు భయం వేసింది.

"ఏది!" బిక్కు బిక్కుమంటూ అడిగాను.

"అదే .. మా ఆవిడ ..! ఛా.. ఛా... దాన్ని ఆవిడ అనగూడదు...".

"మరేం అనాలి!" నాకు తెలీకుండా అనేసాను.

"నీతి జాతిలేని మనిషనాలి. ఎంత ఉద్యోగస్థురాలైతే మాత్రం... వాడితో అలా విచ్చలవిడిగా తిరుగుతుందా!" చటుక్కున కర్చీఫునందుకుని కళ్ళద్దుకున్నాడు.

నాకు అంతా అయోమయంగావుంది.

ఇద్దరం కలిసి కాంటీన్‌కి వెళ్ళాం.

వాడక్కడ కోపంతో, బాధతో, నవరసాలతో చెప్పిన దాని బట్టి విషయం నాకు అర్థమైంది.

వాడి భార్య మరెవరితోనో చనువుగా తిరుగుతోంది. ప్రసాద్‌కాదు ఏ మగాడి మనసు నయినా నలిపివేసే అనుభం అది!

కాఫీ ఇప్పించి, ఓదార్చి వెనక్కి తీసుకొచ్చాను.

అప్పటికే చాలామంది వచ్చేసారు.

కానీ ఎవ్వరూ సీట్లలో లేరు.

అందరూ పరంధామయ్యగారి సీటు చుట్టూ మూగేసివున్నారు. పరిస్థితి అర్థంగాని మేమూ అటు వెళ్ళాం.

"అంతగా బాధపడకండి పరంధామయ్యగారూ... అందుకే అన్నారు అడ్డాలనాడు బిడ్డలుగాని గడ్డాలనాడు కాదని"... ఓదారుస్తున్నాడు పరమేశ్వరరావు.

"కొడుకైతే పర్లేదు. కూతురు అలా చేసింది. అదీ ఆయన బాధ".

"ఏమిటి మీరనేది! కొడుకు చేస్తే అది తప్పకాదు — కూతురు చేస్తే తప్ప అవుతుందా! తప్ప అనుకుంటే అది ఎవరు చేసినా తప్పే" ఆవేశంగా నిరంజనాన్ని ఖండించింది జానకి.

"ముందు మీరు వాదించుకోవడం కాదయ్యా ఆ ముసలాయన్ని వోదార్చండి" హెడ్‌క్లర్కుగారు కోప్పడ్డారు.

"ఏం జరిగింది?" నిరంజనాన్ని అడిగాను.

"పాపం! పరంధామయ్యగారి అమ్మాయి ఎవరితోనో లేచిపోయిందట..."

'ఈ ముండా కొడుకు పిల్లల పెళ్ళి గురించి ఆలోచించడంలేదు. వాళ్ళెవరితోనో లేచిపోతారు చూడు!" అంతకు ముందు ఎన్నోసార్లు పరంధామయ్యగారిని కామెంట్ చేసిన నిరంజనమే ఎంతో బాధతో చెప్పాడు.

బాధనిపించింది.

అందరం తలా ఒకరకంగా ఆయన్ని ఓదార్చి వచ్చి ఆఫీసు పనిలో పడ్డాం.

పెళ్ళి చూపులకోసం ఈ మధ్య ఎక్కువగా శలవులు పెడుతుండడంతో నాసీట్లో పని బాగా పేరుకుపోయింది.

ఫైళ్ళలో మునిగిపోయిన నాకు టైమ్ తెలియలేదు.

"ఏంటి రాజారావ్‌గారూ! తెగ కష్టపడి పోతున్నారు..." జానకి పలకరింపుతో వులిక్కిపడి ఈలోకంలోకి వచ్చాను.

ఫైళ్ళని పక్కకి నెట్టి "కూర్చోండి" ఎదురుగా వున్న కుర్చీని చూపిస్తూ చిన్నగా నవ్వాను.

"మీ పెళ్ళి చూపులు ఎంతవరకూ వచ్చాయ్?" చిన్నగా నవ్వింది.

ఆమె వయసులో నాకన్నా చాలా పెద్దది. అందుకనే అలాంటి చచ్చు జోకుల్ని ఎన్నింటిని వేసినా నవ్వడం తప్పమరేమీ తిరిగి అనలేని బలహీనతవాలో చోటు చేసుకుంది.

"అవునూ బ్రహ్మచారులు.. మీకు ఖర్చులేమివుంటాయి. నాకో రెండువేలు అప్పపెట్టగూడదూ!"

"మీకు నేను అప్పపెట్టడం ఏమిటండీ" మళ్ళీ బలవంతంగా నవ్వాను.

"మొన్నీ మధ్య మా ఇల్లు రిపేరు చేయించాను కదా? వున్న బాలెన్సంతా హుష్‌కాకి అయిపోయింది. మా మేన

కోడలికి అర్జంటుగా డబ్బు కావల్సి వాదగ్గరకి వచ్చింది. అందుకని రెండు వేలు ఇచ్చావంటే మరో మూడు వాల్గువెలల్లో తిప్పిఇచ్చేస్తాను'' అంది జానకి.

ఆవిడ మాటల్లోనూ నిజంలేక పోలేదు. బ్రహ్మచారిని కావడంతో నాకు మిగతావాళ్ళకిలా ఖర్చులు లేవు.



అందుకనే ప్రతినెలా జీతంలో అధిక భాగం బాంక్‌లో వేస్తుంటాము.

ఇంతకు ముందు రెండు మూడు సార్లు ఆవిడ ఇలాగే అడిగి తీసుకువెళ్ళింది. చెప్పిన టైమ్‌కి ఒక వెల అటూ ఇటూగా తిరిగి ఇచ్చేసింది.

అందుకే మరోమాట మాటాడకుండా లంచ్‌లో బాంకుకి వెళ్ళి ఆమెకు రెండువేలు తెచ్చిచ్చాను.

ఎక్కడ చూసినా అశాంతి!

మరో రెండు నెలలు గడిచిపోయాయి.

ఈ రెండు నెలల్లోనూ మరో పదిమంది ఆడపిల్లల్ని చూసాను. కానీ ఎవ్వరూ నాకు నచ్చలేదు.

ఆరోజు ఆఫీస్‌కి వస్తూ నేను చూసిన సంఘటన నాకు పెద్ద షాక్‌నిచ్చింది.

ప్రసాద్ మోటారు సైకిల్ మీద ఆఫీసుకువచ్చాడు. అలా అతను రాగూడదని కాదు!

అంతకు ముందు తన భార్య ఎవరితో తిరుగుతోందని ఆప్తమిత్రుణ్ణయిన నాకు చెప్పుకుని తెగ బాధపడ్డాడో ఆ మనిషి మోటార్ సైకిల్ మీద ఎక్కించుకుని తీసుకొచ్చి దింపి పోయాడు ప్రసాద్‌ని. ఆమో టార్ సైకిల్ మీదే తన భార్యని తిప్పుతున్నాడని తెగబాధపడ్డాడు!

నన్ను చూడగానే వాడూ షాక్ తిన్నాడు కానీ వెంటనే తేరుకుని ''ఈ మధ్య వాసుదేవరావు మా ఫామిలీకి మరీ దగ్గరైపోయాడోయ్. వద్దని వారిస్తున్నా పాపం రోజూ నన్ను ఆఫీసు దాకా తీసుకొచ్చి దింపి పోతున్నాడు'' ఓ వెకిలి నవ్వునవ్వాడు.

నాకు చాలా చిరాకేసింది.

వాడి భార్య ఎవరితోనో తిరుగుతోందని, అతను బంగారు పిచ్చుక కావడంతో వాడు విదిలించే ఎంగిలి మెతుకులుకి ఆశపడి ప్రసాద్ కిమ్మనకుండా పడుంటున్నాడని ఆఫీసులో కొంతమంది గుసగుసలాడుకుంటూంటే విన్నాను. ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాను.

అందుకే ఆవిషయం మీద అతనితో ఎక్కువగా మాట్లాడాలనిపించలేదు.

సీట్లోకి వచ్చి కూర్చోగానే జానకి తనివ్వాల్సిన డబ్బు తెచ్చిచ్చింది.

ఆ డబ్బుని చూడగానే మనసులోని చిరాకు మరింతైంది.

ఈ వెధవ డబ్బుకోసమేగా ప్రసాద్‌లాంటి వాళ్ళంతా ఆత్మాభిమానాన్ని చంపుకుని తిరుగుతున్నది.

ఆ రెండు వేలని టేబుల్ సొరుగులో పారేసి నాపనిలో నిమగ్నమైపోయాను.

లంచ్‌లో ఆ డబ్బుని బాంక్‌లో పడేద్దామని వెళ్తుంటే పరంధామయ్యగారు ఎదురొచ్చారు.

''ఏమండీ! పండక్కి కొత్త అల్లుణ్ణీ, కూతుర్ని పిలిచారా!'' గబుక్కున అడిగేసాను. ఆ తర్వాత అలా ఎందుకు అడిగానా అని బాధపడ్డాను.

కానీ పరంధామయ్యగారు మాత్రం ఏ మాత్రం బాధపడలేదు. పైగా గర్వంగా ''కులం తక్కువైనా మా అల్లుడిది గుణం పెద్దది. ఈ పండక్కి నేను పిలవకపోయినా వాళ్ళిద్దరూ వచ్చారు. మా ఆవిడకి, నాకు బట్టలు తెచ్చారు. ఆ అబ్బాయి ఎంత మర్యాదస్తుడని...'' మురిసి పోసాగారు అల్లుణ్ణే తలచుకుని మురీ పరంధామయ్యగారు.

ఇంతకు ముందు ఈయనేనా ఆఫీసులో అందరి ముందూ అల్లుణ్ణీ కూతుర్ని తక్కువచేసి మాట్లాడి సానుభూతి పొందడానికి కన్నీళ్ళు కూడా పెట్టుకుంది! అనుమానం వేసింది.

''మంచిదండి... బాంక్‌దాకా వెళ్ళి వస్తాను'' గబగబా ఇవతలికి వచ్చేసాను.

బాంక్‌లో డబ్బు వేసి వస్తుంటే ప్రకాశం ఎదురొచ్చాడు.

''ఇప్పుడు ఏం వచ్చినాయ్! ఎర్రియర్సా!'' నవ్వుతూ పలకరించాడు ప్రకాశం.

''కాదు జానకిగారికి రెండు వేలిచ్చాను. ఆవిడ ఆ డబ్బులిస్తేను...''

''సరిపోయింది. ఆవిడకి డబ్బులు పెట్టుబడి పెడుతోంది నువ్వా!'' ఆశ్చర్యంగా అడిగాడు ప్రకాశం.

''పెట్టుబడి ఏమిటి!'' వాడి మాటలు అర్థంకాలేదు నాకు.

''ఆవిడ వడ్డీ వ్యాపారం చేస్తుంది. మా ఆఫీసులోని వాళ్ళతో కాదు, ఇంటి చుట్టు పక్కల వాళ్ళతో ...''

ఉలిక్కిపడ్డాను.

''వాళ్ళ మేనకోడలికి ఏదో అర్జంటుగా డబ్బు అవసరమైందని అడిగితే ఇచ్చాను''.

''రైటే.. అవసరమయ్యే వుంటుంది. ఈవిడ డబ్బో సర్దివుంటుంది... కాకపోతే వాళ్ళదగ్గర వడ్డీ వసూలు చేసి దాన్ని మాత్రం తను మింగి వుంటుంది... నువ్వేమో పాపం బాంక్‌లో నీకు



వచ్చే వడ్డీని కూడా వదులుకుని ఆవిడ వడ్డీలకి తిప్పుకోడానికి వడ్డీకి ఇస్తున్నావన్నమాట!'' ఇంతలో వాడి టోకన్ నెంబర్ని కాషియర్ పిలవడంతో అటు వెళ్లాడు ప్రకాశం.

ప్రసాద్.... పరంధామయ్యగారు... జానకి... వరసగా నా మదిలో మెదిలారు.

డబ్బు... డబ్బు... డబ్బు....

ప్రపంచంలో అందరూ ఆరాధించేది ఆ డబ్బు!

ఆ డబ్బుని కాదని అందం కోసం ప్రాకులాడుతున్న నేనెంత మూర్ఖుణ్ణి!

సీట్లోకి వచ్చికూర్చున్న తర్వాత కూడా రకరకాల ఆలోచనలు నా మనసుని ముసురుతూనే వున్నాయి.

అతి కష్టంతో అయిదు గంటల వరకూ ఏ పనీ చేయకుండా రకరకాల ఆలోచనలతో గడిపాను.

ఇదివరకటి అశాంతి ఇక్కడ పూర్తిగా తొలగిపోయింది. అందుక్కారణం? డబ్బు...!

సరిగ్గా అయిదు గంటలకి ఓనిర్ణయాని కొచ్చాను. ''శాంతీ? నువ్వెకడ? డబ్బులోనా!'' నవ్వొచ్చింది.

సరాసరి శాంతి సంబంధాన్ని తెచ్చిన సుబ్బారావు ఇంటికి వెళ్ళాను.

''శాంతిని చేసుకోవడం నాకిష్టమే!'' నెమ్మదిగా అతన్తో అన్నాను.

భళ్ళున నవ్వాడు సుబ్బారావు.

''శాంతిని నువ్వు పెళ్ళిచేసుకోవడమేమిటి? ఆవిడ పెళ్ళి ఎప్పుడో అయిపోయింది.!?'' పడీ పడీ నవ్వసాగాడు సుబ్బారావు.

అంత అందవికారమైన శాంతి పెళ్ళి అంత త్వరగా జరిగిపోయిందా! ఆశ్చర్యమేసింది.

ఆ విషయాన్నే సుబ్బారావుతో అన్నాను.

''అంత బంగారు పిచ్చుకని నువ్వుకాబట్టి వద్దన్నావుగాని ఎవరైనా ఎగిరి గంతేస్తారని అప్పుడే చెప్పాగా? నువ్వు కాదన్నావని చెప్పడానికి వెళ్ళినప్పుడే మరో సంబంధాన్ని తీసుకువెళ్ళాను. అతను ఎగిరి గంతేసి మరీ ఆమెను పెళ్ళి చేసుకోవడానికి ఒప్పుకున్నాడు..... కంగారు పడకు. ఆమెను చూసి కాదు ఆమె డబ్బుని చూసి!.... సుబ్బారావు ఇంకా ఏమేమో చెబుతున్నాడు. నా బుర్రలోకి ఏమీ ఎక్కడంలేదు. *